● సీతంరాజుకు మద్దతుగా విస్తృత ప్రచారం



విజయనగరంలో ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



పూసపాటిరేగ: కుమిలిలో సీతంరాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సారిపల్లిలో సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, తదితరులు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిలిచిన సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ పలుచోట్ల విస్తృత ప్రచారం గురువారం నిర్వహించారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి ఓటు కోసం అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి మద్దతుగా నిలిచి సీతంరాజును గెలిపించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన



ప్రకృతి వైపరీత్యాలలో ఆపదలో వున్న వ్యక్తులను రక్షిస్తున్న విధానం

పూసపాటిరేగ : ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కోవాలని రిలయన్స్ ప్రతినిధి జి.తిరుమలరావు అన్నారు. మండలంలోని తీర ప్రాంతమైన పతివాడబర్రిపేటలో మత్స్యకారులకు ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన సదస్సుతో పాటు మాక్‌డ్రిల్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సాంకేతికతతో ముందుకు వెళ్లాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రథమ చికిత్స, లైఫ్ జాకెట్లు వినియోగం, మొదలగు వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు గౌరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

బలవంతపు పెట్టుబడులపై నిరసన



నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

భోగాపురం: బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ఎల్ఐసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇతర జాతీయ బ్యాంకుల బలవంతపు పెట్టుబడులను వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలోని స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం నిరసన చేట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సరగడ రమేష్ కుమార్, టి.సూరిబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి పద్మావతి

భోగాపురం: మండలంలోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి పద్మావతి అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతుభరోసా, వెల్‌నెస్, సచివాలయ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను సంప్రదాయం ప్రకారం అలంకరించి, వారికి పళ్లు, స్వీట్లు అందజేశారు. అనంతరం 90 మందికి భోజన ఏర్పాట్లు చేశారు. గర్భిణులు పౌష్టకాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జగదీష్, వైద్యురాలు శ్రావణి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మాణిక్యం, ఎంపీహెచ్ఈవో వీవీఆర్ఎం రాజు, రాకోడు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ మాఫియా ఆగడాలను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

విజయనగరం ఫూల్‌బాగ్: మెడికల్ మాఫియా ఆగడాలను నియంత్రించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. స్థానిక అమర్‌భవన్‌లో గురువారం సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ మాఫియా ఆగడాలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బి.అశోక్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, నాగభూషణం, కె.అప్పన్న, శ్రీను, రాజు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ జాతరకు సర్వం సిద్ధం



ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక కర్రల మార్కెట్ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు నూకాలమ్మ యువజన సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, యడ్ల రాజేష్ తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో జాతర ఆహ్వాన పత్రికలను గురువారం ఆవిష్కరించారు. అమ్మవారి 65వ వార్షికోత్సవాలు ఈ నెల 15న బుధవారం సాయంత్రం అమ్మవారికి పాలాభిషేకం చేసి ప్రారంభిస్తామన్నారు. 16 నుంచి 21వ తేదీ వరకూ జాతర ఉంటుందన్నారు. అమ్మవారికి విశిష్ట పూజలతో పాటూ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. 16న సత్యభామా కలాపం భాగవత ప్రదర్శన, 17న దివ్యాంగుల మల్టీ టాలెంట్ షో, 18న హరిశ్చంద్ర, 19న రేలా రే రేలా, 20న సినీ సంగీత విభావరి, 21న అమ్మవారికి చల్లదన మహోత్సవం, ఊరేగింపు ఉంటుందన్నారు. ఆ రోజు రాత్రి నూకాలమ్మ అమ్మవారి మహోత్సవం అనే హరికథా గానం ఉంటుందన్నారు. ఘటాలతో, శక్తి, గరడి, పులి వేషాలతో నిర్వహించే ఊరేగింపులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కమిటీ సభ్యులు వజ్రపు నవీన్‌కుమార్, యడ్ల భాస్కరరావు, రొంగలి శరత్‌బాబు, రాజేంద్ర ప్రసాద్, మజ్జి అప్పారావు, వెంపడాపు వెంకటరావు, మండల శ్రీనివాసరావు, పతివాడ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆప్టోమెట్రితో ఉన్నత భవిష్యత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిజిస్ట్రార్ విజయ్‌కుమార్

నెల్లిమర్ల రూరల్: ఆప్టోమెట్రీ విభాగంలో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉందని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ రిజిస్ట్రార్ వై.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీని గురువారం సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆప్టోమెట్రీ విభాగంలో చదువుతున్న సెంచూరియన్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో తమ వద్ద అత్యుత్తమ ప్రతిభ చూపిస్తున్నారని కితాబిచ్చారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, రిజిస్ట్రార్ రమణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ రైడ్ చేస్తే శిక్ష తప్పదు

విజయనగరం క్రైమ్: ట్రిపుల్ రైడింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ హరిబాబునాయుడు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గురువారం ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారికి కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రధాన కూడళ్లలో అత్యధిక వేగంతో ట్రిపుల్ రైడింగ్‌లు చేస్తున్న సంఘటనలు కనిపించాయన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టిసారించి ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ చలానాలు విధిస్తున్నామన్నారు.

భూముల రీసర్వేతో సమస్యల పరిష్కారం



అలుగోలులో భూముల రీసర్వేను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ వైకుంఠం తదితరులు

నెల్లిమర్ల రూరల్: సమగ్ర భూముల రీసర్వేతో రైతుల ఏళ్ల కాలం నాటి సమస్యలు పరిష్కారమవుతాయని వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు అన్నారు. మండలంలోని అలుగోలు పంచాయతీలో గురువారం భూముల రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం సమగ్ర భూముల సర్వే చేసేందుకు సాహసించలేదన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. భూముల రీసర్వేలో సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము అప్పలనాయుడు, మత్స శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

నెల్లిమర్ల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల్లిమర్ల తాలూకా యూనిట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్థానిక తహసీల్దారు, ఎస్టీఓ కార్యాలయాల్లో గురువారం వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పెండింగ్ డీఆర్ ఎరియర్లను వెంటనే విడుదల చేయాలన్నారు. పెన్షన్ల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని కోరారు. హెల్త్ కార్డులపై అన్ని ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నా రు. పెన్షనర్లకు సంబంధించిన నాన్ ఫైనాన్షియల్ ఐటమ్స్ విషయాలన్నీ సీఎఫ్ఎంఎస్, హెర్బ్‌కు సంబంధం లేకుండా సబ్ ట్రెజరీ కార్యాలయాల్లోనే పూర్తయ్యేటట్లు చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కమలాకర్, ప్రకాషరావు, సూర్యారావు తదితరులు న్నారు.

కిడ్నీల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

విజయనగరం ఫోర్ట్: కిడ్నీల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నెఫ్రాలజిస్టు డాక్టర్ ఆర్.శివకుమార్, యూరాలజిస్టు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని గురువారం తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధులను అదుపులో ఉంచుకోవాలన్నారు. కిడ్నీ సమస్యలు వచ్చినప్పుడు వెంటనే వైద్యున్ని సంప్రదించి చికిత్స చేయించుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చునని తెలిపారు. ధీర్ఘకాలిక మూత్ర పిండాల వ్యాధి, బీపీ, షుగర్ వ్యాధి వల్ల కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం కిడ్నీ పరీక్షల నిర్వహించే ప్యాకేజీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎం.డి తిరుమలప్రసాద్, డాక్టర్ ఎన్‌టీ కిరణ్‌కుమార్, సెంట్రల్ హెడ్ పద్మకుమార్, ఏఓ నారాయణ పాల్గొన్నారు.

వాకర్స్ ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: పొగ తాగటం ఆరోగ్యానికి హానికరమని, ఎక్కువ శాతం ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారని, పొగతాగే వారికన్నా పొగ పీల్చే వారు ఎక్కువ శాతం అనారోగ్యం పాలవుతున్నారని శ్రీ సాయికృష్ణ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. నగరంలోని అయ్యన్నపేటలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ సభ్యులంతా పొగతాగటం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, గౌరవ సలహాదారుడు ఎ.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు వై.నలమారాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: మండలంలోని డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని విద్యుత్ శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లు, స్తంభాల నిర్వహణ తదితర కారణాల వలన విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మండలంలోని డెంకాడతో పాటు గుణుపూరు, గుణుపూరుపేట, ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, చొల్లంగిపేట, డీఆర్.పాలెం, నగరపుపేట, పోతయ్యపాలెం, పెద తాడివాడ, పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస, దొడ్డిబాడువ, చందకపేట, మహంతిపేట, లెంకపేట, సింగవరం, నాతవలస గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలివేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: మండలంలోని భోగాపురం, నారుపేట, సిమ్మపేట, సన్‌రే రోడ్డు పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జ్ఞానేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజయగణపతికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో విజయగణపతికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో విజయగణపతికి స్నపనం, పంచామృతభిషేకాలు, అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో రామనారాయణం ఆలయ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, ఆలయ మేనేజర్లు శ్రీనివాసరాజు, ఏవీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట అలంకరణలో ముత్యాలమ్మ



ప్రత్యేక అలంకరణలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారు

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేటలో కొలువైన ముత్యాలమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు విశిష్ట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మద్దాల భాస్కరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాధికాలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఘటాలను నిలిపారు. చిత్రవిచిత్ర వేషధారణలతో అమ్మవారి అనుపు ఉత్సవం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలసిన విక్రమ్, గణేష్



రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డితో విక్రమ్, గణేష్

విజయనగరం: వైఎస్సార్‌సీపీ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్, పార్టీ నాయకుడు గుల్లుపల్లి గణేష్ విశాఖపట్నం విమానాశ్రయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తమ సేవలను గుర్తించి యూత్ వింగ్ బాధ్యతలను అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి అవనాపు విక్రమ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి వారికి పలు సూచనలు చేశారు. పార్టీ బలోపేతంతో పాటు పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థి విజయానికి కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.

పోలీసులకు ప్రథమ చికిత్సపై

అవగాహన అవసరం



పీటీసీలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

● పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు

విజయనగరం క్రైమ్: విధి నిర్వహణలో ఉన్న ప్రతి పోలీస్ ప్రథమ చికిత్సపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా గురువారం పీటీసీలో శిక్షణార్థులకు సీపీఆర్‌పై పీటీసీ మెడికల్ ఆఫీసర్ ఉదయ్ కుమార్, తిరుమల మెడికవర్ డాక్టర్ రామారావు పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఆర్‌పై అవగాహన ఉన్నవారు విధి నిర్వహణలో చుట్టుపక్కల వారికి, సహ ఉద్యోగులకు, ఇంటి వారికి అత్యవసర సమయంలో చికిత్స చేసి వారి ప్రాణాలను కాపాడేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, డీఎస్పీలు వివి.అప్పారావు, సిహెచ్.రామారావు, సీఐలు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించాలి : ఎమ్మెల్యే

బొబ్బిలి రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను పట్టభద్రులు గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు కోరారు. పట్టణంలో కళింగ వైశ్య భవనంలో ఎమ్మెల్సీ ఓటర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులంతా తొలి ప్రాధాన్యత ఓటు సుధాకర్‌కు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి శ్రీనివాసరావు, కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగిలో..

బాడంగి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. సీతంరాజుకు మద్దతుగా ప్రచారం చేశారు.

● సమాజంలో మహిళల పాత్ర కీలకం

సమాజంలో మహిళల పాత్ర ఎనలేనిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో భాగంగా పలు చోట్ల ర్యాలీలు, వివిధ రకాల పోటీలు గురువారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నెల్లిమర్ల: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, మహిళా ఉద్యోగులు



భోగాపురం: జాతీయ రహదారిపై మానవహారం నిర్వహిస్తున్న మహిళలు



పూసపాటిరేగ: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు తదితరులు



డెంకాడ: కాంప్లెక్స్ వద్ద ర్యాలీ చేస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది